




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక :51 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు ఆదివారం 27 అక్టోబర్ 2024 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 51 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE SUN 27 OCTOBER 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


# తల్లిని కోర్టుకు ఈడుస్తావా..

## మీడియా ముందే కన్నీళ్లు పెట్టుకున్న షర్మిల

- సుబ్బారెడ్డి... జగన్ మోచేతి నీళ్లు తాగే వ్యక్తి: షర్మిల ఘాటు వ్యాఖ్యలు
- జగన్-షర్మిల ఆస్తుల వివాదంలో సుబ్బారెడ్డి వ్యాఖ్యలు
- జగన్ ఆస్తిలో షర్మిలకు భాగం ఉంటే షర్మిల కూడా జైలుకెళ్లి ఉండేదని వెల్లడి
- సుబ్బారెడ్డి తన బిడ్డలు, మనవలపై ప్రమాణం చేయాలన్న షర్మిల




పెన్ పవర్ డెస్క్:జగన్-షర్మిల ఆస్తుల వివాదంపై వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ... టీడీపీ కుట్రలో షర్మిల పావుగా మారిందని అనడం తెలిసిందే. జగన్ కు సంబంధించిన ఆస్తుల్లో షర్మిలకు కూడా వాటాలు ఉన్నది నిజమే అయితే, ఈడీ షర్మిలపై కూడా కేసులు పెట్టేది కదా... అని వైవీ వ్యాఖ్యానించారు. సరస్వతి సిమెంట్స్ ఆస్తులు ఈడీ అటాచ్ మెంట్ లో ఉన్నాయని, అలాంటి ఆస్తుల కోసం షర్మిల పోరాడుతున్నారా? అని ప్రశ్నించారు.

ఆస్తుల విషయంలో ఇప్పటివరకు జగన్ ఒక్కరే జైలుకెళ్లారని, మరి ఆ ఆస్తులపై షర్మిలకు కూడా హక్కు ఉంటే ఆమె కూడా జైలుకు వెళ్లేవారని వైవీ సుబ్బారెడ్డి వివరించారు. వైవీ సుబ్బారెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలపై ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల ప్రెస్ మీట్లో ఘాటుగా స్పందించారు. "సుబ్బారెడ్డి గారు ఎవరు...? సుబ్బారెడ్డి గారు జగన్ మోచేతి నీళ్లు తాగే వ్యక్తి. జగన్ పదవులు ఇస్తే ఆ పదవులు అనుభవిస్తున్నారు. సుబ్బారెడ్డి కుటుంబం రాజకీయంగానే కాదు, ఆర్థికంగానూ లబ్ధి పొందింది. జగన్ సీఎంగా ఉన్న సమయంలో సుబ్బారెడ్డి, ఆయన కొడుకు ఆర్థికంగా లాభపడ్డారు. మరి సుబ్బారెడ్డి గారు ఇలా కాక ఇంకెలా మాట్లాడతారు?

సుబ్బారెడ్డి గారు మాత్రమే కాదు... రేపు విజయసాయిరెడ్డి కూడా ఇలాగే మాట్లాడొచ్చు. ఎందుకంటే, సాయిరెడ్డి కూడా వాళ్ల టీమ్ లోనే ఉన్నారు... వాళ్ల మోచేతి కిందే ఉన్నారు. అందుకే ఆయన మాట్లాడినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి ఇద్దరూ కూడా జగన్ పక్షాన ఉన్నారని తెలిసి కూడా... నిన్న నేను రాసిన లేఖలో ఆ ఇద్దరి పేర్లను ఎందుకు ప్రస్తావించానంటే... వాళ్లలో ఇంకా ఏమైనా నిజాయతీ మిగిలుందా అని చూశాను. ప్రజలకు, ముఖ్యంగా అమ్మకు కూడా వాళ్ల గురించి తెలియాలి అనుకున్నాను.

వీళ్లిద్దరికీ నిజాలన్నీ తెలుసు. వీళ్లకు రాజశేఖర్ రెడ్డి గురించి మొత్తం తెలుసు. రాజశేఖర్ రెడ్డి మనోభావాలు, ఆయన ఆశయాలు అన్నీ తెలుసు. అయినా కూడా ఇంత దిగజారి మాట్లాడుతున్నారు. వాళ్ల నిజస్వరూపం బట్టబయలు కావాలనే లేఖలో వాళ్ల పేర్లను చేర్చాను. ముఖ్యంగా, అమ్మకు అర్థం కావాలని వాళ్ల పేర్లు రాశాను.

నా విషయానికొస్తే... నేను చెబుతున్నది నిజమని ప్రమాణం చేయగలను. సుబ్బారెడ్డి గారు కూడా ఆయన చెబుతున్నది నిజమని ప్రమాణం చేయగలరా? భారతి సిమెంట్స్ అయితేనేమి, సాక్షి అయితేనేమి... ఇలాంటి ఆస్తులన్నింటిలో నలుగురి బిడ్డలకు (జగన్ ఇద్దరు పిల్లలు, షర్మిల ఇద్దరు పిల్లలకు) సమాన వాటా ఉండాలన్నది రాజశేఖర్ రెడ్డి గారి నిర్ణయం. ఇది నిజమని ఇవాళ నా బిడ్డలపై ప్రమాణం చేసి చెబుతున్నాను. రాజశేఖర్ రెడ్డి గారు చనిపోక ముందు... పాప (షర్మిల) పేరు మీదకు ఇంకా ఆస్తులు బదలాయించలేదా? అని జగనన్నను అడిగారు. అందుకు జగనన్న... డోంట్ వర్రీ డాడ్... పాప మేలు కోరే వాళ్లలో నేను ముందు ఉంటాను అన్నాడు. ఇది నిజమని నా బిడ్డలపై

వివరాలు 2లో..

ట్రోలింగ్ చేస్తే లీగల్ నోటీసులు ఇస్తా...

## నాకు దొరికితే బట్టలూడదీసి కొడతా



- తనపై, సీఎంపై, ఇతర కాంగ్రెస్ నేతలపై ట్రోలింగ్ చేస్తున్నారని ఆగ్రహం
- నాయకుల ప్రసంగాలను ఎడిట్ చేసి ట్రోలింగ్ చేస్తున్నారని మండిపాటు
- బీఆర్ఎస్ సోషల్ మీడియా ఓ దండుపాళ్యం బ్యాచ్‌లా తయారైందని ఆగ్రహం

వివరాలు 2లో..

## ఘోర రోడ్డు ప్రమాదం.. ఆరుగురి దుర్మరణం



- లారీ కిందికి దూసుకెళ్లి నుజ్జునుజ్జయిన కారు
- తాడిపత్రిలో ఇస్కాన్ నగర సంకీర్తన నుంచి తిరిగొస్తుండగా ఘటన
- మృతుల కుటుంబాలకు అండగా ఉంటామన్న సీఎం చంద్రబాబు
- బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి

వివరాలు 2లో..

## టీడీపీ సభ్యత్వ కార్డు ఉంటే సమాజంలో ఓ గౌరవం ఉంటుంది



- మంగళగిరిలో టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభించిన చంద్రబాబు
- టీడీపీ రాకముందు తెలుగువారికి సరైన గౌరవం లేదని వ్యాఖ్యలు
- టీడీపీ ఒక పొలిటికల్ యూనివర్సిటీ అని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నేడు మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీడీపీ సభ్యత్వ కార్డు ఉంటే సమాజంలో ఓ గౌరవం ఉంటుందని పేర్కొన్నారు. టీడీపీ రాకముందు తెలుగు వారికి సరైన గుర్తింపు లేదని

వివరాలు 2లో..

## రూ.100తో టీడీపీ సభ్యత్వం తీసుకోండి

- టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభమైందన్న లోకేశ్
- రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా ఉంటుందని వెల్లడి
- సభ్యత్వం తీసుకోవడం ద్వారా టీడీపీ కార్యకర్తనని ఘనంగా చాటాలని పిలుపు



పెన్ పవర్ డెస్క్:టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ వివరాలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులారా... పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది అని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ రూ.100తో టీడీపీ సభ్యత్వం

వివరాలు 2లో..

## జగన్ అతి మంచితనం, అతి నిజాయతీతోనే ఈ సమస్యలు వస్తున్నాయట!

- జగన్ దుష్ట రాజకీయాలు చేయడంలో దిట్ట అంటూ పల్లా వ్యాఖ్యలు
- ఆస్తుల పంపకంలో దిగజారాడని విమర్శలు
- ప్రజల సొమ్ము కొల్లగొట్టిన వాడు బాగుపడడని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు

వివరాలు 2లో..

## బుడమేరు వరదలకు కారణం కొల్లేరు ఆక్రమణలే

- గత నెలలో విజయవాడలో భారీ వరదలు
- గతంలో కొల్లేరు ఆక్రమణలపై తాము పోరాడామన్న నారాయణ
- అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కొల్లేరు ఆక్రమణలపై ఫిర్యాదు
- ఆయన ఆదేశాలతో నాటి సీఎం వైఎస్ చర్యలు తీసుకున్నారని వెల్లడి
- కొల్లేరులో చేపల చెరువుల్ని తక్షణమే ధ్వంసం చేయాలని డిమాండ్
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కు నారాయణ లేఖ




వివరాలు 2లో..

## వయనాడ్ ప్రజలకు ప్రియాంక గాంధీ బహిరంగ లేఖ



- ఎన్నికల్లో పోటీ నాకు కొత్త కావొచ్చు... పోరాటం మాత్రం కాదన్న ప్రియాంక
- ప్రకృతి సృష్టించిన బీభత్సాన్ని కళ్లారా చూశానన్న ప్రియాంక గాంధీ
- ఆ కష్టాల తర్వాత మీరు ముందుకు కదిలిన తీరు స్ఫూర్తిదాయమని వ్యాఖ్య
- వయనాడ్ ఓటర్లు తనకు మార్గదర్శకంగా నిలుస్తారని ప్రియాంక ఆశాభావం

వివరాలు 2లో..

## పవన్ ఆదేశాలు... సరస్వతి పవర్ సంస్థ భూముల్లో అధికారుల సర్వే

- జగన్-షర్మిల ఆస్తుల పంపకం వ్యవహారంలో తెరపైకి సరస్వతి పవర్ సంస్థ పేరు
- ఈ సంస్థకు చెందిన భూముల్లో అటవీ భూములు ఉన్నాయని కథనాలు
- సమగ్ర నివేదిక ఇవ్వాలంటూ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు
- కదిలిన అధికార యంత్రాంగం



పెన్ పవర్ డెస్క్:జగన్-షర్మిల ఆస్తుల పంపకం వ్యవహారంలో సరస్వతి పవర్ సంస్థ పేరు తెరపైకి వచ్చింది. పల్నాడు జిల్లా దాచేపల్లి వద్ద ఈ సంస్థకు చెందిన 1,515 ఎకరాల భూముల్లో అటవీ భూములు కూడా ఉన్నాయని కథనాలు వచ్చాయి. దీనిపై రాష్ట్ర డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పందించి, సరస్వతి పవర్ సంస్థకు చెందిన భూముల్లో ఎంత మేర అటవీ భూములు ఉన్నాయో పూర్తి వివరాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పవన్ ఆదేశాల

వివరాలు 2లో..

## మేడారం మినీ జాతర.. ఫిబ్రవరి 12వ తేదీ నుంచి..



పెన్ పవర్ డెస్క్: దేశంలోనే తెలంగాణలో జరిగే మేడారం జాతరకు విశేషమైన గుర్తింపు ఉంది. మేడారం మినీ జాతర తేదీలను సమ్మక్క సారలమ్మ పూజారులు ప్రకటించారు. 2025 ఫిబ్రవరి 12 తేదీ నుంచి 15 వరకు పూజారులు మినీ జాతరను నిర్వహించనున్నారు. మినీ మేడారం జాతరలో అమ్మవార్లను గద్దెలపైకి తీసుకరారు. గద్దెల వద్ద పూజారులు ప్రత్యేక పూజలు చేస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయనున్నారు. కాగా ప్రతి రెండేళ్లకోసారి

వివరాలు 2లో..

## ఇరాన్‌పై వందలాది యుద్ధ విమానాలతో ఇజ్రాయెల్ భీకర దాడులు..

- ఈ నెల మొదట్లో ఇజ్రాయెల్‌పై బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన ఇరాన్
- తాజాగా ప్రతీకార దాడులకు దిగిన ఇజ్రాయెల్
- ఇరాన్ రక్షణ వ్యవస్థ, ఆయుధగారాలే లక్ష్యంగా దాడులు
- తమకు పెద్దగా నష్టం జరగలేదన్న ఇరాన్

వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్:ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను లక్ష్యంగా చేసుకున్న ఇజ్రాయెల్ వందలాది విమానాలతో తెల్లవారుజామున భీకర దాడులు జరిపింది. ఈ దాడుల నేపథ్యంలో జరిగిన పేలుళ్లతో టెహ్రాన్ చిగురుటాకులా కంపించింది. ఇజ్రాయెల్ విమానాలు వేసిన బాంబులు దీపావళి రోజున ఆకాశంలో పేలిన టపాసులను తలపించాయి. అయితే, ఇజ్రాయెల్ దాడుల వల్ల తమకు పరిమితంగానే నష్టం వాటిల్లినట్టు ఇరాన్ స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలకు తోడు తాజా



## ఎడిటర్ వ్యూ

# ఎట్టకేలకు దిగొచ్చిన చైనా

నాలుగేళ్ల ప్రతిష్టంభన ముగిసింది. భారత్ చైనాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఎల్ఏసీలో ఇరు సైన్యాల మధ్య ఇకపై ఘర్షణలు ఉండవనే ఆశ మళ్లీ మొగ్గతొడిగింది. భారత్, చైనా రైవల్రీ ఆటలో హాల్ట్ రావడంతో రెండు దేశాల మధ్య వాతావరణం చల్లారిందనే సూచనలు కనిపిస్తున్నాయి. 40 మంది ప్రాణాలు తీసిన నాలుగేళ్ల నాటి ఘర్షణకు తర్వాత ఇది ఇరు దేశాల సంబంధంలో కీలక ముందుడుగేనని చెప్పాలి..భారత్ ? చైనా మధ్య వాస్తవాధీన రేఖ వెంబడి తూర్పు లడఖ్‌లో దాదాపు నాలుగేళ్లు సైనిక ప్రతిష్టంభనను ముగించడానికి ఇరు దేశాల మధ్య ఒప్పందం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఒప్పందం ప్రకారం నియంత్రణ రేఖ వద్ద ఇరు దేశాల బలగాల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభమైంది. తూర్పు లద్ధాఖ్ సెక్టార్ లోని కీలక ప్రాంతాలైన డెస్పాంగ్, డెమ్చోక్ నుంచి కొన్ని తాత్కాలిక సైనిక స్థావరాలను, తాత్కాలిక నిర్మాణాలను ఇరు దేశాలు తొలగిస్తున్నాయని రక్షణ వర్గాలు తెలిపాయి. బలగాల ఉపసంహరణ ప్రక్రియ అంతా పూర్తయిన తరువాత మరో నాలుగైదు రోజుల్లో ఈ రెండు ప్రాంతాల్లో పెట్రోలింగ్ ను పునరుద్ధరించనున్నట్లు తెలుస్తోంది.తూర్పు లడఖ్‌లోని గల్వాన్ లోయలో 2020 జూన్ 15న భారత్ ? చైనా సైనికుల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘర్షణలో ఇరవై మందికిపైగా భారత సైనికులు వీరమరణం పొందారు. చైనా కూడా భారీగా సైనికులను కోల్పోయింది. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య సరిహద్దులో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. దీంతో ఎల్ఏసీ వెంబడి ఇరు దేశాలు భారీగా సైనిక బలగాలను మోహరించాయి. అక్కడ తాత్కాలిక నిర్మాణాలు, సైనిక స్థావరాలను ఏర్పాటు చేశాయి. ఎల్ఏసీ సరిహద్దుల్లో ఉద్రిక్తత వాతావరణాన్ని తగ్గించేందుకు ఇరు దేశాల సైనిక అధిపతుల మధ్య పలు దఫాలుగా చర్చలు జరిగినా సఫలం కాలేదు.ఇరుదేశాల మధ్య ఇటీవల ఒప్పదం కుదిరింది. రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సులో ఈ ఒప్పందాన్ని భారత్ ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ ధ్రువీకరించారు. దీంతో వాస్తవాధీన రేఖ వెంబడి 2020 గల్వాన్ ఘర్షణకు ముందు నాటి యథాస్థితి కొనసాగనుంది. ఇక నుంచి 2020లో గస్తీ నిర్వహించిన సైనికులు పెట్రోలింగ్ పాయింట్లకు స్వేచ్ఛగా వెళ్లొచ్చు. ఒకవైపు స్నేహ హస్తం చూపిస్తున్నట్లే చూపించి, మరో చేత్తో గన్ గురిపెట్టే బుద్ధి చైనాది. అందుకే, ఇప్పుడు ఈ అనుమానాలు. 1962లో జరిగిన భారత్ చైనా యుద్ధం తర్వాత చైనా ఓవరాక్షన్ చాలా సార్లు హద్దు మీరింది. 1975 నుండీ సరిహద్దులో ఎన్నో సార్లు ఆక్రమణలకు పాల్పడింది. భారత్ సహనాన్ని అవకాశంగా తీసుకొని రెచ్చిపోయింది. అయితే, నాలుగేళ్ల క్రితం 40 మందిని బలితీసుకున్న గాల్వాన్ లోయ ఘర్షణలతో అది పీక్స్‌కెళ్లింది. కట్ చేస్తే.. ఇప్పుడు, రెండు దేశాలూ 'బోర్డర్ పెట్రోల్ ఒప్పందానికి' వచ్చాయి.అక్టోబర్ 22 నుండి 24 వరకూ రష్యాలో బ్రిక్స్ సదస్సులో భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్‌లు మాట్లాడుకునే అవకాశం ఉందనే వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. నాలుగేళ్లుగా తూర్పు లడఖ్‌లోని వాస్తవ నియంత్రణ రేఖ వెంబడి సైనిక ప్రతిష్టంభనను పరిష్కరించే ప్రయత్నాలలో ఈ ఒప్పందం కీలకమైన పురోగతిగా కనిపిస్తోంది. ఈ ఒప్పందంతో.. భారత్, చైనా మధ్య వాస్తవాధీన రేఖలో పెట్రోలింగ్ నిర్వహించే హక్కులను పునరుద్ధరించడానికి రెండు దేశాలూ అంగీకరించాయి. దీనితో, లడఖ్‌కు ఉత్తరాన ఉన్న డెప్సాంగ్ మైదానాలు, దక్షిణాన డెమ్‌చోక్ ఎల్ఏసి వెంబడి, పాత పెట్రోలింగ్ పాయింట్ల వరకు పెట్రోలింగ్ నిర్వహించుకోవచ్చు. అంటే దేప్సాంగ్ మైదానాల్లో, డెమ్‌చోక్‌లోని చార్డింగ్ నుల్లాలో పెట్రోలింగ్ పాయింట్ వరకు భారత సైనికులు పెట్రోలింగ్ చేయొచ్చు. ఇక, ఈ ఒప్పందంలో భాగంగానే, తూర్పు ప్రాంతంలో, ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్‌లోని సున్నితమైన ప్రదేశాలకు సంబంధించి కొన్ని పరస్పర ఒప్పందాలు కూడా చేసుకున్నట్లు తెలుస్తోంది.నాలుగేళ్ల క్రితం, 2020లో ఘర్షణలు చోటుచేసుకున్న గాల్వాన్ వ్యాలీ, పాంగోంగ్ త్సో పాయింట్లను రెండు సంవత్సరాల క్రితం బఫర్ జోన్‌లు ఏర్పాటు చేసి, దళాలను విడదీశారు. గతంలో ఇక్కడ పెట్రోలింగ్ చేసే సైనికులు 13 నుండి 18 మంది ఉండగా.. ఘర్షణను నివారించడానికి కనీసం 14 నుండి 15 మంది సైనికులు గస్తీలో ఉంటారని నిర్ణయించారు. ఇక, ఇప్పుడు, ఇరుపక్షాల పెట్రోలింగ్ పరస్పరం మార్చుకోడానికి ఒప్పందం కుదిరింది. పెట్రోలింగ్ చేసే క్రమంలో రెండు వైపుల నుండీ సమన్వయం ఉంటుందనీ.. ఒకరికొకరు సమాచారం ఇచ్చిపుచ్చుకుంటాయని ఒప్పందంలో పొందుపరిచారు. ఇందులో భాగంగా, నెలవారీ ప్రాతిపదికన, కేస్-టు-కేస్ ఆధారంగా కమాండర్, కో-కమాండర్ స్థాయి సమావేశాలు కూడా నిర్వహించాలని ఒప్పందంలో పేర్కొన్నారు. ఇప్పటివరకు కుదిరిన అవగాహన ప్రకారం, డెప్సాంగ్‌లోని కీలక ప్రాంతాల నుండి చైనా దళాలు ఉపసంహరించుకుంటాయి. అయితే, ఇది లడఖ్‌లో రాబోయే తీవ్రమైన శీతాకాల ప్రణాళికలో భాగమేనని కొన్ని వర్గాలు చెబుతున్నాయి. 2020లో గల్వాన్ లోయలో చోటుచేసుకున్న ఘర్షణ తర్వాత భారత్-చైనా దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలోనే సరిహద్దుల వెంబడి ఇరువైపులా భారీగా బలగాలను మోహరించాయి. దాదాపు 68 వేల మంది సైన్యాన్ని భారత్ సరిహద్దుకు పంపించింది. సరిహద్దుల్లో డ్రాగన్ సైన్యం ఏదైనా కవ్వింపులకు పాల్పడితే.. దానికి దీటుగా స్పందించేందుకు ఇండియన్ ఆర్మీ అన్నివిధాలా సిద్ధమైంది. అయితే, ఈ సమస్యకు పరిష్కారం కోసం ఆర్మీ కమాండర్ స్థాయిలో గత నాలుగేళ్లుగా చర్చలు జరుగుతూనే ఉండగా.. తాజాగా కీలక పురోగతి కనిపించింది. దీనితో, అంతర్జాతీయ ఫోరమ్‌లలో రెండు దేశాల మధ్య ఉన్నత-స్థాయి దౌత్య చర్చలు సులభతరం అవుతాయి. అలాగే, ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడతాయి. దీనితో పాటు, సరిహద్దులో భారత్ చేస్తున్న మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆటంకం కలగకుండా ఉంటుంది. ఇక, చైనా విషయానికొస్తే, ఇతర ప్రపంచ ఉద్రిక్తతల మధ్య భారతదేశంతో సరిహద్దు వివాదాలను తగ్గించడం దానికి వ్యూహాత్మక లాభమనే చెప్పాలి.

# తల్లిని కోర్టుకు ఈడుస్తావా..

- మొదటి పేజీ తరువాయి
ప్రమాణం చేసి చెబుతున్నా. మరి నిన్న తాను చెప్పిన విషయాలన్నీ సుబ్బారెడ్డి గారు కూడా తన బిడ్డల మీద, మనవల మీద ప్రమాణం చేసి చెప్పగలరా?" అని షర్మిల నిలదీశారు. తాను రాసిన బహిరంగ లేఖలో వైవీ సుబ్బారెడ్డి, సాయిరెడ్డి పేర్లను ప్రస్తావించడానికి కారణం వాళ్ల నిజస్వరూపం బయటపెట్టడానికేనని.. వాళ్ల గురించి మా అమ్మ విజయమ్మకి తెలియజేయడానికేనని కీలక వ్యాఖ్యలు చేశారు. ఆస్తులకు సంబంధించి నేను చెప్పినవన్నీ నిజమని నేను ప్రమాణం చేస్తా.. సుబ్బారెడ్డి కూడా ఆయన చెప్పింది నిజమని ప్రమాణం చేయగలరా అని సవాల్ విసిరారు. సాక్షి, భారతి కంపెనీల్లో నలుగురు మనువళ్లకు సమాన వాటాలు ఉండాలనేది రాజశేఖర్ రెడ్డి మ్యాండేట్.. ఇది నిజమని తన బిడ్డల మీద ప్రమాణం చేసి చెబుతున్నానని అన్నారు. తనతో సమానంగా షర్మిలకు ఆస్తులు ఇస్తానని జగన్ తన తండ్రి రాజశేఖర్ రెడ్డి మాటకు ఇచ్చారని గుర్తు చేశారు. అసలు గిఫ్ట్ ఇవ్వడానికి ఎవరైనా ఎంవోయూ రాసుకుంటారా అని ప్రశ్నించారు. ఇది అందరి ఇండ్లలో ఉండేదే.. ఘర్ ఘర్ కీ కహానీ అని జగన్ చాలా సింపుల్ గా ఆస్తుల విషయాన్ని కొట్టేపారేశారు. కన్నతల్లిని కోర్టుకు ఈడ్చటం ఘర్ ఘర్ కీ కహానీనా అంటూ ఎమోషనల్ అయ్యారు. కన్న తల్లి మీద కేసు పెట్టిన దౌర్భగ్యుడు ఎవరన్నా ఉన్నారా అని విమర్శించారు. మీకు మానవత్వం, ఎమోషన్స్ లేవా.. మా పిల్లలు మీ కళ్ల ముందు పెరగలేదా.. వాళ్లకు ఎందుకు అన్యాయం చేయాలనుకుంటున్నారంటూ సుబ్బారెడ్డి మాటలను గుర్తు చేసుకుని ఆమె కన్నీళ్లుపెట్టుకున్నారు. జగన్ తీరుతో చాలా బాధ వేసిందన్నారు.

# బుడమేరు వరదలకు కారణం కొల్లేరు ఆక్రమణలే

**పెన్ పవర్ డెస్క్:**గత నెలలో బుడమేరు పొంగి... విజయవాడలో సంభవించిన వరదలకు కారణం కొల్లేరు ఆక్రమణలేనని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ఈ సందర్భంగా కొల్లేరు సంబంధిత పలు విషయాలను ఆయన గుర్తు చేశారు. గతంలో కొల్లేరు ఆక్రమణలపై తాము పోరాడినట్లు తెలిపారు. అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు ఫిర్యాదు చేయడంతో నాటి ఉమ్మడి ఏపీ సీఎం వైఎస్ఆర్ చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. ఈ క్రమంలో కొల్లేరు సరస్సు ఆక్రమణలపై నాటి పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ లవ్ అగర్వాల్‌ను ఫిష్ మాఫియా టార్గెట్ చేయడంతో ఆయనకు హాని జరగకుండా తామే అండగా నిలిచామన్నారు.
ప్రస్తుతం కొల్లేరు చుట్టూ ఆక్రమణలు భారీగా పెరిగిపోయాయన్నారు. చివరికి కొల్లేరు తడి భూములు, పక్షుల అభయారణ్యం కూడా అక్రమార్కులు ఆక్రమించడం బాధ కలిగిస్తుందన్నారు. కొల్లేరులో చేపల చెరువుల్ని తక్షణమే ధ్వంసం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
100 చదరపు మైళ్ల విస్తీర్ణం కలిగిన కొల్లేరు సరస్సు ఇప్పుడు 20-25 ఎకరాలు మాత్రమే మిగిలిందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ గురించి మాట్లాడే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కొల్లేరు సరస్సును కాపాడే మంచి అవకాశం వచ్చిందన్నారు. ఈ సందర్భంగా కొల్లేరు పరిరక్షణపై సుప్రీంకోర్టు కూడా ధిక్కరణ నోటీసులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో కొల్లేరు ఆక్రమణలపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు నారాయణ లేఖ రాశారు.

# జగన్ అతి మంచితనం, అతి నిజాయతీతోనే ఈ సమస్యలు వస్తున్నాయట!

- మొదటి పేజీ తరువాయి
పల్లా శ్రీనివాసరావు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు ప్రసంగిస్తూ, మాజీ సీఎం జగన్ పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని జగన్ 43000 కోట్లు దోచుకున్నారని అన్నారు. వైసీపీ పార్టీని అవినీతి మూలాలపై స్థాపించారని విమర్శించారు. అలాంటి పార్టీలు కచ్చితంగా కూలిపోతాయని స్పష్టం చేశారు. "దోపిడీ ఆస్తుల పంపకంలో దుష్ట సంప్రదాయానికి దిగజారిన వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి. జగన్ అతి మంచితనం, అతి నిజాయతీ వలనే ఇలాంటి సమస్యలు వస్తున్నాయని సాక్షి పత్రికలో రాశారు. వాస్తవానికి జగన్ కి ధన పిచ్చి ఎక్కువ. నీచ రాజకీయాలు చేయడం జగన్ కు వెన్నతో పెట్టిన విద్య.
2004 నాటికి జగన్ ఆస్తులు కోటి 73 లక్షలు. ఇప్పుడు ఆయన ఆస్తులు సుమారు 8 లక్షల కోట్లు. ఈ ఆస్తులు ఎక్కడ నుంచి వచ్చాయి ? ఇది ప్రజల సొమ్ము కాదా? ఎవరికీ లేని మినహాయింపులు జగన్ కు ఎలా వస్తున్నాయి? ఇన్ని సంవత్సరాలు ఎలా బెయిల్ పై బయట ఉన్నారు?
ప్రజల జీవితాలు మార్చడానికి, రాష్ట్రం అభివృద్ధి చేయడానికి ఉన్నతమైన వ్యక్తులు రాజకీయ పార్టీలను నడపాలి. కేవలం డబ్బులు దోచుకోవడానికి... ప్రజలను మభ్యపెట్టి మళ్లీ అధికారంలోకి రావడానికి రాజకీయ పార్టీలను నడపకూడదు. పేదవాడి కళ్లలో సంతోషం చూసేవాడే రాజకీయ నాయకుడు. కోడి కత్తి, వివేకా హత్య, సోషల్ మీడియాను అడ్డుపెట్టుకొని అబద్ధాలను ప్రచారం చేసి జగన్ రెడ్డి గతంలో అధికారంలోకి వచ్చాడు. ఈ ఎన్నికల్లో కూడా గులక రాయి డ్రామాతో అధికారంలోకి రావడానికి యత్నించాడు. ఇది ప్రజలంతా గమనిస్తున్నారు. ప్రజలను ఒక్కసారే మోసం చేయగలరు. అన్ని సార్లు మోసం చేయలేరు అన్న దానికి 2024 ఎన్నికలే నిదర్శనం. జాతీయ మీడియా కూడా ముఖ్యమంత్రుల్లో అత్యధిక ధనవంతుడు జగనే అని ప్రచారం చేసింది. అంత డబ్బులు అతనికి ఎలా వచ్చాయో జగనే ప్రజలకు సమాధానం చెప్పాలి" అని పల్లా శ్రీనివాసరావు అన్నారు

# ట్రోలింగ్ చేస్తే లీగల్ నోటీసులు ఇస్తా... నాకు దొరికితే బట్టలూడదీసి కొడతా

**పెన్ పవర్ డెస్క్:**తాను అనని మాటలను అన్నట్లుగా ట్రోలింగ్ చేస్తే లీగల్ నోటీసులు ఇస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డి హెచ్చరించారు. తనను ఇష్టారీతిన ట్రోలింగ్ చేస్తున్న వారు తనకు దొరికితే బహిరంగంగానే బట్టలు ఊడదీసి కొడతానని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తనపై, సీఎంపై, ఇతర కాంగ్రెస్ నేతలపై చేస్తున్న ట్రోలింగ్ పట్ల ఆయన తీవ్రంగా స్పందించారు.ఇటీవల కొంతమంది సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రుల మీద కూడా సోషల్ మీడియా వేదికగా అవాకులు, చెవాకులు పేలుతున్నారని జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నాయకుల ప్రసంగాలను ఇష్టారీతిన ఎడిట్ చేసి ట్రోలింగ్ చేస్తున్నారని ఆరోపించారు.
తాను ఓ మహిళా కలెక్టర్‌ను బూతులు తిట్టినట్లు సోషల్ మీడియాలో దారుణమైన
పోస్టులు పెడుతున్నారన్నారు. కానీ తాను ఏ కలెక్టర్‌నూ దూషించలేదని జగ్గారెడ్డి వివరణ ఇచ్చారు. సోషల్ మీడియాలో తమపై జరుగుతున్న ప్రచారం సరికాదన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా ఓ దండుపాళ్యం బ్యాచ్‌లా తయారయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రూ.100తో టీడీపీ సభ్యత్వం తీసుకోండి

- మొదటి పేజీ తరువాయి
తీసుకోవాలని పిలుపునిచ్చారు. తద్వారా రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా, కుటుంబ సభ్యులకు విద్య, ఉద్యోగ, వైద్య సదుపాయం అందుతుందని వివరించారు.
దేశంలో మరే ఇతర రాజకీయ పార్టీ చేయని రీతిలో కార్యకర్తల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన చరిత్ర మన తెలుగుదేశం పార్టీది అని లోకేశ్ పేర్కొన్నారు. సభ్యత్వం తీసుకోండి... తెలుగుదేశం పార్టీ కార్యకర్తనని ఘనంగా చాటండి అంటూ సోషల్ మీడియా ద్వారా పిలుపునిచ్చారు.
టీడీపీ సభ్యత్వాన్ని మొబైల్ లేదా కంప్యూటర్ పై వాట్సాప్ ద్వారా https://bit.ly/4eK2Lj5 లింక్ ను ఉపయోగించి పొందవచ్చని, లేదా https://telugudesam.org/membership-2024-26/ వెబ్ సైట్ లింక్ ద్వారా ఆన్ లైన్లోనే తీసుకోవచ్చని లోకేశ్ వివరించారు. పాత సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవచ్చని తెలిపారు.

## టీడీపీ సభ్యత్వ కార్డు ఉంటే సమాజంలో ఓ గౌరవం ఉంటుంది

- మొదటి పేజీ తరువాయి
అన్నారు.
తెలుగుదేశం పార్టీ ఒక రాజకీయ విశ్వవిద్యాలయం వంటిదని, అనేకమంది నేతలను తయారుచేసిన పార్టీ అని అభివర్ణించారు. కార్యకర్తల కోసం శిక్షణ తరగతులు నిర్వహించడమే కాకుండా, ప్రత్యేకంగా స్కూల్ ఏర్పాటు చేసి డిగ్రీలు ఇచ్చిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని చంద్రబాబు స్పష్టం చేశారు. జాతీయ భావంతో ముందుకు వెళుతూ ప్రతిభకు పెద్దపీట వేసిన పార్టీ టీడీపీ... జాతీయస్థాయిలో టీడీపీ పోషించిన కీలకపాత్రలు మరే పార్టీకి సాధ్యం కాలేదు అని వివరించారు. పార్టీ కార్యక్రమాలకు టెక్నాలజీని అనుసంధానం చేస్తున్నామని, ఎవరికి పదవి ఇచ్చినా అన్ని జాగ్రత్తలు తీసుకుని, అన్ని అంశాలు పరిశీలించాకే ఇస్తానని చంద్రబాబు వెల్లడించారు.
టీడీపీ పనైపోయిందని గతంలో మాటలు వినిపించాయని, ఆ మాటలు అన్నవారు ఇప్పుడేమయ్యారు? అని ప్రశ్నించారు. ఇలాంటి వాళ్లతో మనం పోరాడాల్సి వస్తుందని ఊహించలేదు... గత ఐదేళ్ల కష్టాలు ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నాం అని వ్యాఖ్యానించారు. మొన్నటి ఎన్నికల్లో మన స్ట్రయిక్ రేట్ ఓ చరిత్ర అని చంద్రబాబు చెప్పారు. సోషల్ రీఇంజినీరింగ్ చేశామని, అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు.

# వయనాడ్ ప్రజలకు ప్రియాంక గాంధీ బహిరంగ లేఖ

**పెన్ పవర్ డెస్క్:**వయనాడ్ లోక్ సభ నియోజకవర్గం ప్రజలకు ఏఐసీసీ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ బహిరంగ లేఖ రాశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా "నా ప్రియమైన వయనాడ్ సోదర, సోదరీమణులారా" అంటూ లేఖను పోస్ట్ చేశారు. వయనాడ్ నుంచి ఆమె కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. నేను మొదటిసారి ఎన్నికల్లో పోటీ చేస్తుండవచ్చు... కానీ ప్రజల తరఫున పోరాటం చేయడం కొత్త కాదు అని అందులో పేర్కొన్నారు. కొన్ని నెలల క్రితం తాను, తన సోదరుడు రాహుల్ గాంధీ మండక్కై, చూరాల్‌మల వెళ్లామని గుర్తు చేసుకున్నారు. ప్రకృతి సృష్టించిన బీభత్సాన్ని కళ్లారా చూశానన్నారు. ఆ కష్టాల నుంచి బయటపడి మీరు ముందుకు కదిలిన తీరు స్ఫూర్తిదాయమని పేర్కొన్నారు.ప్రజాప్రతినిధిగా పోటీ చేయడం నాకు కొత్త కావొచ్చు... కానీ ఎప్పుడూ ప్రజల తరఫున గళం వినిపిస్తూనే ఉన్నాను అని వెల్లడించారు. ఈ కొత్త ప్రయాణంలో తనకు వయనాడ్ ప్రజలు మార్గదర్శకంగా నిలుస్తారని భావిస్తున్నానని ప్రియాంక పేర్కొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. ఆరుగురి దుర్మరణం

**పెన్ పవర్ డెస్క్:**అనంతపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. శింగనమల మండలం నాయనపల్లి క్రాస్ వద్ద లారీని కారు ఢీకొన్న ఘటనలో ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. వేగంగా ప్రయాణిస్తున్న కారు లారీ కిందికి దూసుకెళ్లడంతో ఈ ప్రమాదం జరిగింది. కారు నుజ్జునుజ్జు అయింది. మృతులు అనంతపురం ఇస్కాన్ ప్రార్థన మందిరం భక్తులుగా గుర్తించారు. వారు తాడిపత్రి నగర సంకీర్తన కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తుండగా, ఈ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కాగా, అనంతపురం జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగి ఆరుగురు మృతి చెందిన ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# ఇరాన్‌పై వందలాది యుద్ధ విమానాలతో ఇజ్రాయెల్ భీకర దాడులు..

- మొదటి పేజీ తరువాయి
దాడుల నేపథ్యంలో యుద్ధ భయాలు నెలకొన్నాయి. ఇప్పటికే గాజాలో హమాస్, లెబనాన్‌లో హిజ్బుల్లాతో ఇజ్రాయెల్ పోరాడుతోంది. 1980లో ఇరాక్‌తో యుద్ధం తర్వాత ఇరాన్‌పై ఇజ్రాయెల్ బహిరంగంగా దాడులకు దిగడం ఇదే తొలిసారి.ఈ నెల మొదట్లో ఇజ్రాయెల్‌పై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో దాడిచేసింది. ప్రతిగా ఇజ్రాయెల్ ఇప్పుడు వందకుపైగా యుద్ధ విమానాలతో ఇరాన్‌పై విరుచుకుపడింది. మూడు దఫాలుగా ఇజ్రాయెల్ దాడికి దిగింది. తొలిసారి ఇరాన్ రక్షణ వ్యవస్థపై, రెండు, మూడోసారి ఇరాన్ ఆయుధగారాలపై దాడులు చేసింది. ఇవి ప్రతీకార దాడులేనని ఇజ్రాయెల్ పేర్కొంది.

# మేడారం మినీ జాతర.. ఫిబ్రవరి 12వ తేదీ నుంచి..

- మొదటి పేజీ తరువాయి
మేడారం మహాజాతర జరుగుతుంది.మినీ మేడారం జాతరకు కూడా భక్తులు భారీగా వస్తుంటారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు కిటకిటలాడుతుంటాయి. మండమెలిగే పండుగ సందర్భంగా మొక్కులు తీర్చుకోవడానికి భక్తులు భారీగా తరలివస్తారు. తల్లులను చూసి పులకించిపోతారు. గద్దెల ముందు పొర్లు దండాలు పెడతారు. సారె చీరలు, బంగారం(బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. గొర్రె, మేకపోతులు, కోడిపుంజులను బలిచ్చి, విందు చేసుకుంటారు. మన రాష్ట్రం నుంచే కాక చత్తీస్ గఢ్, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివస్తారు.పెద్ద జాతరకు వెళ్లొచ్చిన భక్తులు, మినీ మేడారం పేరుతో తిరిగి ఇళ్లల్లో అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మేడారంలో మండమెలిగే పండుగ మొదలుకావడంతో ఊర్లలో తల్లులకు పూజలు నిర్వహిస్తుంటారు. అమ్మవార్లకు పసుపు, కుంకుమ, బంగారం సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. బంధువులు, చుట్టుపక్కల వారిని పిలుచుకొని ఇంట్లోనే సమ్మక్క పండుగ చేసుకుంటారు.

# పవన్ ఆదేశాలు... సరస్వతి పవర్ సంస్థ భూముల్లో అధికారుల సర్వే

- మొదటి పేజీ తరువాయి
నేపథ్యంలో, నేడు అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. పల్నాడు జిల్లా దాచేపల్లి, మాచవరం మండలాల్లోని సరస్వతి పవర్ సంస్థకు చెందిన భూముల్లో అధికారులు సర్వే చేపట్టారు. దాచేపల్లి డీఆర్వో ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది ఈ సర్వేలో పాల్గొన్నారు. సర్వే అనంతరం అటవీశాఖ అధికారులు సమగ్ర నివేదిక రూపొందించి మంత్రి పవన్ కల్యాణ్ కు సమర్పించనున్నారు.

# శారదా పీఠం..అక్రమాల పుట్ట



**విశాఖపట్టణం, అక్టోబరు 26, పెన్ పవర్:** శారదాపీఠం.. పేరుకే పీఠం కానీ వివాదాల పుట్ట అనే విమర్శలు వస్తున్నాయి. ఎందుకంటే పీఠం చెప్పేదొకటి, తీరా చేసేది ఇంకొకటి. ఒక్కో ప్రభుత్వం వచ్చినప్పుడు ఒక్కో రకంగా ఉంటూ వత్తాసు పలకడం, సర్కారు కేటాయించిన భూములను వాణిజ్యపరంగా వాడుకోవడం పరిపాటిగా వస్తోంది. కాంగ్రెస్ హయాంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైసీపీ హయాంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అడిగిందే తడవుగా, అది ఏదైనా సరే ఇష్టానుసారం ఇచ్చేశారని ఆరోపణలు కోకొల్లలు. 2024 ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలిచి అధికారంలోకి వచ్చిన తర్వాత శారదాపీఠానికి వరుస షాక్‌లు ఇస్తోంది. అటు విశాఖపట్నంలో, ఇటు తిరుమలలో కేటాయించిన భూములను రద్దు చేస్తూ సర్కారు కీలక నిర్ణయాలు తీసుకున్నది.వివాదాస్పద పీఠాధిపతి స్వరూపానందేంద్రకు చెందిన శారదాపీఠానికి ఈ మధ్య అన్నీ ఎదురుదెబ్బలే తగులుతున్నాయి. వైసీపీ హయాంలో వైఎస్ జగన్ ఇచ్చిన భూములన్నింటినీ తిరిగి తీసుకునే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది. స్వాధీనం చేసుకున్న ఆ భూములను ప్రజా ప్రయోజనాల కోసం వాడేందుకు ప్రయత్నాలు చేస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో భీమిలి మండలం కొత్తవలసలో ఎకరం లక్ష రూపాయిల చొప్పున 15 ఎకరాలు కేటాయించింది. అయితే మార్కెట్‌లో ఎకరం రూ. 15 కోట్ల వరకూ ఉంది. అంటే రూ. 225 కోట్ల విలువైన స్థలాన్ని కేవలం రూ. 15 లక్షలకే ధారాదత్తం చేసింది. పీఠానికి ఆదాయాన్ని పెంచుకోవడం కోసం భూములను వాడుకోవాలన్న దురుద్దేశాన్ని నేటి ప్రభుత్వం గ్రహించింది. వివాదానికి దారి తీసిన ఈ కేటాయింపులను రద్దు చేయాలని ఇటీవల కేబినెట్ భేటీలో నిర్ణయించింది.తిరుమలలోని గోగర్భం డ్యామ్ వద్ద కూడా పీఠానికి 5వేల చదరపు అడుగుల భూములను 30 ఏళ్ల పాటు ప్రభుత్వం లీజుకు ఇచ్చింది. అయితే దీన్ని అడ్డంపెట్టుకుని భారీగా అక్రమ నిర్మాణాలు సాగించింది. ఇదంతా వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు 2005 ఫిబ్రవరి జరిగిన కథ. అప్పట్లో దేవస్థానం భూములను ఆక్రమించి మరీ నిర్మాణాలు చేపట్టడం గమనార్హం. వైఎస్ జగన్ సీఎం అయ్యాక మరింత రెచ్చిపోయిన మరిన్ని అక్రమాలకు తెరలేపింది పీఠం. అదనపు నిర్మాణాలకు టీటీడీ నుంచి అనుమతి పొంది మరీ నిర్మాణాలు చేపట్టింది. ఇలా మొత్తంగా 1851.06 చ.మీ. మేర నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు టీటీడీ అధికారులు తేల్చారు. నిబంధనలు అతిక్రమించినా సరే శారదాపీఠం నుంచి కేవలం వివరణ మాత్రం తీసుకొని సైలెంట్ అయ్యింది ప్రభుత్వం. దీనికి తోడు హిందూ సనాతన ధర్మాన్ని కాపాడేందుకు పీఠం పనిచేస్తోందని, ఆ నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తూ 2023లో టీటీడీ తీర్మానం చేసి మరీ ప్రభుత్వానికి పంపింది. నాటి నుంచి నిన్న మొన్నటి వరకూ అక్రమాలు కొనసాగుతూనే వచ్చాయి. ఈ విషయాలన్నీ గమనించిన ప్రభుత్వం శారదాపీఠం అక్రమాలపై దృష్టి సారించింది.తిరుమలలో విశాఖ శారదా పీఠం నిర్వాహకులు అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించారని, ఈ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని టీటీడీనీ ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు అనుమతులు రద్దు చేస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవోను ఆదేశించింది. అంతేకాదు భవిష్యత్‌లో ఈ తరహా భూ కేటాయింపులు, భవనాల నిర్మాణానికి సంబంధించిన అంశాల తీర్మానాల కంటే ముందుగా ప్రభుత్వ పరిశీలనకు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. అయితే ఈ అక్రమ నిర్మాణాలు ఏమవుతాయి? కూల్చివేతలు ఉంటాయా? లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తుందా? అనేది పెద్ద ప్రశ్నగా మారింది. అటు భీమిలిలో కేటాయించిన భూములను ప్రభుత్వం ఏం చేయబోతోందనే దానిపై కూడా ఎలాంటి స్పష్టత రాలేదు. జనసేన నేత కిరణ్ రాయల్ తిరుమలలోని పీఠం భూములు, నిర్మాణాలను పరిశీలించారు. తిరుమలలో ప్రతి గజం ఆ శ్రీవారిదేనని, స్వామీజీలు, బాబాజీలు దోచుకుంటాం అంటే కుదరదని ఆయన హెచ్చరించారు. భక్తి పేరిట తిరుమల, వైజాగ్‌లో కోట్ల రూపాయిలు విలువ చేసే భూములను కాజేశారని ఆరోపించారు. ఈ నిర్మాణాలను కూల్చేస్తే రానున్న రోజుల్లో మరొకరు ఇలాంటి కట్టడాలు చేయాలంటే భయం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఈ నిర్మాణాల వ్యవహారం కోర్టుల పరిధిలో ఉండటంతో తమకు అనుకూలంగా తీర్పు వస్తుందని కచ్చితంగా కూల్చివేతలు ఉంటాయని కూటమి నేతలు చెబుతున్నారు.

# ఇంకా అందని వరదల పరిహారం
# సిఎంఓను తప్పు దోవ పట్టిస్తున్న అధికారులు?



**విజయవాడ, అక్టోబరు 26, పెన్ పవర్:** విజయవాడలో బుడమేరు వరద పరిహారం అందక బాధితుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇప్పటికీ వేలాదిమందికి పరిహారం అందకపోవడంతో నిత్యం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు అందరికి పరిహారం చెల్లించేసినట్టు కొందరు ఐఏఎస్ అధికారులు సిఎంఓను మభ్యపెట్టడమే సమస్యకు కారణంగా కనిపిస్తోంది.అధికారుల నిర్లక్ష్యం బుడమేరు వరద బాధితుల పాలిట శాపంగా మారింది. ఆగస్టు 30, 31 తేదీల్లో కురిసిన ఆకస్మిక వర్షాలతో విజయవాడ నగరంలోని 32 డివిజన్లు వరద ముంపుకు గురయ్యాయి. సెప్టెంబర్ 1వ తేదీ తెల్లవారు జామున బుడమేరు కట్టలకు గండి పడటంతో నగరాన్ని వరద ముంచెత్తింది. వరదను అంచనా వేయడం నుంచి బాధితులకు పరిహారం అందించడం వరకు ఎన్టీఆర్ జిల్లా అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. వరదలు వచ్చి రెండు నెలలు గడుస్తున్నా సర్వం కోల్పోయిన బాధితులు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.వరద ముంపుకు గురైన బాధితులకు ఉదారంగా సాయం చేయాలని ఏపీ సీఎం ఆదేశించినా దానిని అమలు చేయడంలో జిల్లా యంత్రాంగం విఫలమైంది. ముఖ్యమంత్రి వద్ద మంచి మార్కులు కొట్టేసే క్రమంలో కొందరు అధికారుల నిర్వాకంతో వరద నష్టం లెక్కింపులోనే గందరగోళం జరిగింది. వరద ముంపు పూర్తిగా తగ్గకుండానే ఎన్యూమరేషన్ చేపట్టడంతో పెద్ద సంఖ్యలో బాధితుల పేర్లు జాబితాల్లో చేరలేదు.ఆ తర్వాత బాధితుల పేర్లను చేర్చడంలో సచివాలయాల నుంచి తాసీల్దార్ల వరకు ఉదాసీనంగా వ్యవహరించారు. మొదటి, రెండో అంతస్తుల్లో ఉన్న వారికి కూడా పరిహారం చెల్లించాలని ముఖ్యమంత్రి ఆదేశించినా ఇప్పటి వరకు వారికి పరిహారం దక్కలేదు. పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి ప్రజలు విసిగిపోయారు.విజయవాడ నగరాన్ని ముంచెత్తిన వరదలో బాధితులకు గతంలో ఎప్పుడు లేని విధంగా ముఖ్యమంత్రి పరిహారం ప్రకటించారు. బాధితుల్లో చాలామంది సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగలడంతో వారిని ఆదుకునేలా పరిహారం ప్రకటించారు. అయితే బాధితులను గుర్తించడంలో మాత్రం రెవిన్యూ యంత్రాంగం దారుణంగా విఫలమైంది. వరద నష్టాన్ని అంచనా వేయడంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రప్పించిన 1700 బృందాలు హడావుడిగా, మొక్కుబడిగా సర్వే చేయడంతోనే ఈ సమస్య తలెత్తింది. సచివాలయాల స్థాయిలోనే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం, వారికి జాబితాలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో ఇప్పటికీ పరిహారం దక్కలేదు.విజయవాడ నగరంలోని రెండు ఎమ్మార్వో కార్యాలయాల పరిధిలో వేల సంఖ్యలో బాధితులకు ఇప్పటికీ పరిహారం దక్కలేదు. దీనిపై గత కొన్ని రోజులుగా సీపీఎం ఆందోళన నిర్వహిస్తోంది. బాధితులకు సరైన సమాచారం ఇవ్వకపోవడం, పరిహారం చెల్లింపులో అధికారుల నిర్లక్ష్యాన్ని తప్పు పడుతూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వరద నష్టంపై సమగ్ర సర్వే చేపట్టాలని డిమాండ్ చేస్తోంది. తాజాగా విజయవాడ భవానీపురంలో ఎమ్మార్వో కార్యాలయాన్ని బాధితులు ముట్టడించారు.మరోవైపు వరద పరిహారం చెల్లింపు విషయంలో ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ఐఏఎస్ అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఏమి జరుగుతుందో గుర్తించే ప్రయత్నాలు కూడా చేయకుండా రాజకీయ ప్రేరేపిత ఉద్యమాలుగా నివేదికలు ఇస్తున్నారు. అంతిమంగా అది ప్రభుత్వ వైఫల్యంగా మారింది. విజయవాడ వరద బాధితులకు సాయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు రివ్యూలో అందరికి పరిహారం అందినట్టు ఎన్టీఆర్ జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్, విఎంసి కమిషనర్ పేర్కొన్నారు.వరదలు తగ్గిన 15 రోజుల్లో 4,19,528 మందికి ప్రభుత్వం పరిహారం అందించామని, ఇప్పటి వరకు మొత్తం రూ.618 కోట్ల పరిహారం నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకి జమచేశామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ముందుగా రూ.602 కోట్లు బదిలీ చేశామని...తరువాత వచ్చిన దరఖాస్తులను పరిశీలించి దాదాపు 9 వేల మందికి మరో రూ.16 కోట్లు చెల్లించామని అధికారులు తెలిపారు.

తరువాత కూడా చాలా మంది పరిహారం కోసం దరఖాస్తు చేసుకున్నారని..వాటిని కూడా పరిగణలోకి తీసుకున్నామని అధికారులు తెలిపారు. మళ్లీ కొత్తగా 2,954 దరఖాస్తులు రాగా....పరిశీలనలో 1,646 దరఖాస్తులు అర్హత కలిగినవిగా గుర్తించామని.....మిగిలిన వాటిలో 1052 దరఖాస్తులు అర్హత లేనివిగా తేల్చామని చెప్పారు.పరిహారం కోసం వచ్చే ప్రతి దరఖాస్తు పరిశీలించాలని అర్హులు ఉంటే తప్పకుండా సాయం అందేలా చూడాలని అధికారులను సిఎం ఆదేశించారు. సచివాలయాల్లో లబ్ధిదారుల వివరాలు పూర్తిగా ప్రదర్శించాలని సిఎం సూచించారు. ఒకవేళ ఎవరైనా పరిహారం పొందడానికి అనర్హులు అయితే...ఆ విషయాన్ని వారికి స్పష్టంగా తెలియజెప్పాలని ఆదేశించారు. మొత్తం 2954 దరఖాస్తుదారుల వివరాలను సచివాలయంలో, వెబ్ సైట్ లో ఉంచాలని సిఎం ఆదేశించారు. వీరితో పాటు మొదటి ఫేజ్ లోపరిహారం పొందిన 4,19,528 మంది పేర్లు కూడా ఆయా సచివాలయాల్లో ప్రదర్శించాలని సిఎం సూచించారు. గత నెలన్నరగా లబ్దిదారుల వివరాలను అందుబాటులో ఉంచాలని సిఎం స్వయంగా ఆదేశించినా 179 సచివాలయాల్లో ఎక్కడా అది ఆచరణలోకి రాలేదు.

# పల్నాడులో డయేరియా మరణాలు...




**గుంటూరు, అక్టోబరు 26, పెన్ పవర్:** ఏపీలో డయేరియా మరణాలు వీడటం లేదు. అతిసారం సమస్యతో పల్నాడు జిల్లాకు చెందిన ఇద్దరు గురువారం మృతి చెందారు. ఇటీవల విజయనగరం జిల్లా గుర్లలో సైతం డయేరియాతో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మరువక ముందే దాచేపల్లి పట్టణంలోని అంజనీపురం కాలనీలో కలుషిత తాగునీరు, అపరిశుభ్రత వాతావరణంతో డయేరియా వ్యాప్తి చెందింది.అంజనీపురం కాలనీలోగత నాలుగు రోజులుగా పలువురు వాంతులు, విరోచనాలతో ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో వారి పరిస్థితి విషమించి బుధవారం రాత్రి తమ్మిశెట్టి వెంకటేష్ (20), గురువారం తెల్లవారుజామున బండారు చిన వీరయ్య (65) మృతి చెందారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు .డయేరియాతో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కలెక్టరు అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా వైద్యాధికారి రవికుమార్ దాచేపల్లి వచ్చారు. బాధితులను పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. పారిశుద్ధ్యం మెరుగుపచాలని అధికారులను ఆదేశించారు. అంజనీపురం కాలనీలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు.విజయనగరం జిల్లా గుర్ల మండలంలో కొద్ది రోజుల క్రితం డయేరియాతో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలంలో బుధవారం వ్యాధి ప్రబలి ఇద్దరు చనిపోగా, 14 మంది ఆస్పత్రుల పాలయ్యారు.గత జూలై నెలలోనే పల్నాడు జిల్లా దాచేపల్లి, పిడుగురాళ్ల, కారంపూడి మండలాల్లో డయేరియా కేసులు నమోదై పలువురు మరణించారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కలుషిత నీటి సరఫరాకు అడ్డుకట్ట వేయకపోవడంతో దాచేపల్లి మండలంలో మరోసారి వ్యాధి విజృంభించింది.దాచేపల్లి పంచాయతీ అంజనాపురంలో బుధవారం బండారు చిన్న వీరయ్య(58), తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్ (21) బుధవారం రాత్రి మృతి చెందారు. చిన్న వీరయ్య మంగళవారం నుంచే వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న వెంకటేశ్వర్లు బుధవారం మధ్యాహ్నం డయేరియా బారిన పడ్డారు. కుటుంబ సభ్యులు స్థానికంగా చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట తరలిస్తుండగా దారిలోనే ప్రాణాలు విడిచాడు.అంజనాపురంలో తాగు నీరు కలుషితం కావడం వల్లే డయేరియా వ్యాప్తి చెందినట్లు గుర్తించారు. అంజనాపురం కాలనీ ప్రజలకు తాగు నీరు అందించే బోరు సమీపంలో సెప్టిక్ ట్యాంక్ నీళు,, మురికి కాలువల్లోని నీరు చేరటం వల్లే కలుషితమైనట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామంలో పారిశుధ్యం నిర్వహణ కూడా అధ్వానంగా ఉంది. మురికి కాలువల్లో చెత్త పేరుకుపోయింది.పల్నాడు జిల్లాలో అతిసారంపై సీఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడారు. దాచేపల్లిలో పరిస్థితి, ప్రభుత్వపరంగా తీసుకున్న చర్యలను కలెక్టర్ సీఎంకు వివరించారు. ఆ ప్రాంతంలో సాధారణ స్థితి వచ్చేంతవరకు నిత్యం పర్యవేక్షించాలని సీఎం సూచించారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని సీఎం ఆదేశించారు.జూలై నెలలోనే జిల్లాలో అతిసారం వ్యాధి వ్యాప్తి చెందిందని, అప్పుడే చంద్రబాబు ప్రభుత్వం సరైన చర్యలు తీసుకొని ఉంటే ఇప్పుడు వ్యాపించి ఉండేది కాదని స్థానికులు ఆరోపించారు. జులైలో దాచేపల్లి మండలం కేసానుపల్లిలో డయేరియాకు వంగూరి నాగమ్మ అనే మహిళ మృతి చెందగా, మరో 30 మంది ఆస్పత్రి పాలయ్యారు.పిడుగురాళ్ల, కారంపూడి మండలాల్లోనూ పదుల సంఖ్యలో డయేరియా బారినపడ్డారని అప్పట్లో మంత్రి నారాయణ సమస్య పరిష్కరిస్తామని చెప్పినా చేయలేదని ఆరోపించారు. డయేరియా విస్తరించిన నేపథ్యంలో బోర్లను మూసివేసి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది

## పంచారామాలకు 350 బస్సులు




**విజయవాడ, అక్టోబరు 26, పెన్ పవర్:** కార్తికమాసం నవంబర్ 2 నుంచి ప్రారంభం కాబోతోంది. ఈ మాసంలో పరమ శివుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. కార్తిక సోమవారం నాడు శైవక్షేత్రాలను దర్శిస్తే పుణ్యం లభిస్తుందని నమ్ముతారు. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీ దృష్టి దృష్ట్యా ఆర్టీసీ బస్సులు నడిపేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.కార్తిక మాసంలో ఎక్కువ మంది భక్తులు పంచారామాలు, త్రిలింగ దర్శనం కోసం వెళ్తుంటారు. దీంతో వారికి తగ్గట్టు ఏపీఎస్ ఆర్టీసీ ప్యాకేజీలను ఆఫర్ చేస్తోంది. ఈ ప్యాకేజీలతోపాటు.. వనభోజనాలు, ఆలయాల సందర్శన కోసం చాలా మంది ఆర్టీసీ బస్సులను బుక్ చేసుకున్నారు. వీటి కారణంగా గతంలో ఎన్నడూ లేని స్థాయిలో ఆదాయం సమకూరింది. ఈ నేపథ్యంలో.. ఈసారి కూడా గతేడాది కంటే ఎక్కువ సంఖ్యలో బస్సులను సిద్ధం చేస్తున్నారు.ఎన్టీఆర్ జిల్లా నుంచి పంచారామాలు, శైవ క్షేత్రాలకు ఈ ఏడాది 350 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. విజయవాడ నుంచి 150, జగ్గయ్యపేట నుంచి 34, తిరువూరు నుంచి 34, ఇబ్రహీంపట్నం నుంచి 25, విద్యాధరపురం నుంచి 15, ఆటోనగర్ నుంచి 30, గవర్నర్‌పేట 1 నుంచి 22, గవర్నర్‌పేట 2 డిపో నుంచి 40.. ఇలా మొత్తం ఒక్క ఎన్టీఆర్ జిల్లా నుంచే 350 ప్రత్యేక బస్సులను శైవ క్షేత్రాలకు నడిపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.ఈసారి డిమాండ్ ఎక్కువగా ఉండొచ్చని గతం కంటే సర్వీసులను పెంచినట్టు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. పంచారామాల ప్యాకేజీ కింద ఒకేరోజు భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, అమరావతి, సామర్లకోటలో క్షేత్రాలను దర్శించుకునే వీలు కల్పించారు. డిమాండ్‌ను బట్టి అరుణాచలం, సముద్ర స్నానాలకు కూడా బస్సులను తిప్పనున్నట్టు ఆర్టీసీ ఆఫీసర్లు చెబుతున్నారు.మరోవైపు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మహానంది, యాగంటి, శ్రీశైలం ఆలయాలకు ఒకటిన్నర రోజులో వెళ్లి వచ్చేలా.. త్రిలింగ దర్శిని ప్యాకేజీని ప్రకటించారు. వీటితోపాటు శ్రీశైలం, కొండవీడు, అన్నవరం, కర్ణాటకలోని దేవనహల్లి తదితర ఆలయాలకు వేరుగా బస్సులు నడుపుతున్నారు. ఈ ప్యాకేజీలకు సంబంధించి ఆన్‌లైన్, ఆఫ్ లైన్‌లో వివరాలను అందుబాటులో ఉంచారుగత ఏడాది కార్తిక మాసంలో స్పెషల్ బస్సులు కిక్కిరిసిపోయాయి. రూ.86.44 లక్షల ఆదాయం వచ్చింది. 87 శాతం ఓఆర్ నమోదైంది. కిలోమీటరుకు రూ.58.72 జమ అయింది. కొవిడ్‌కు ముందు 2019లో వచ్చిన ఆదాయం కంటే ఇది ఎక్కువ. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం ఇంకా ఎక్కువ రద్దీ ఉంటుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నారు.

## సత్తిబాబు దూరం అవుతున్నారా..



**విశాఖపట్టణం, అక్టోబరు 26, పెన్ పవర్:** ఉత్తరాంధ్ర జిల్లాల్లో సీనియర్ నేత బొత్స సత్యనారాయణ. సామాజికపరంగా, ఆర్థికంగా ఆయన బలమైన నేత. ఉత్తరాంధ్రలో ఆయన మోస్ట్ సీనియర్ మాత్రమే కాదు.. ఎన్నో ఉన్నత పదవులు అనుభవించిన బొత్స సత్యనారాయణ వైసీపీ హైకమాండ్ పట్ల అసంతృప్తిగా ఉన్నారా? జగన్ తీసుకుంటున్న నిర్ణయాలు ఆయనకు రుచించడం లేదా? అన్న ప్రశ్నకు నిన్నటి జగన్ విజయనగరం జిల్లా పర్యటన స్పష?టం చేస్తుంది. ఎందుకంటే తన సొంత జిల్లాకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ వస్తే బొత్స సత్యనారాయణ మాత్రం హాజరు కాలేదు. ఎక్కడా ఆయన టూర్ లో కనిపించలేదు. గొర్ల గ్రామంలో పర్యటించిన జగన్ డయేరియా బాధితులను పరామర్శించారు. మృతి చెందిన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అయితే తన సొంత జిల్లాలో పర్యటిస్తున్నప్పుడు కనీసం సమాచారం బొత్స సత్యనారాయణకు లేదంటున్నారు. అందుకే ఆయన ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారని చెబుతున్నారు. సత్తిబాబు లేకుండా తొలిసారి జగన్ విజయనగరం జిల్లాలో పర్యటించినట్లయింది. ఆయన గైర్హాజరీ కారణాలపై పార్టీలో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. బొత్స ఎందుకు రాలేదు? ఆయనలో ఉన్న అసంతృప్తి ఏంటి? జగన్ కు ఆయనకు దూరం పెరిగిందా? మొన్ననే కదా? ఎమ్మెల్సీ సీటు ఇచ్చి మరీ బొత్స సత్యనారాయణను శాసనమండలిలో చీఫ్ గా చేశారు. అలాంటి సత్తి బాబు ఎందుకు డుమ్మా కొట్టారన్న దానిపై పార్టీలో నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు.కానీ కొన్ని కారణాల వల్లనే బొత్స సత్యనారాయణ ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారని చెబుతున్నారు. ప్రధానంగా ఉత్తరాంధ్రకు విజయసాయి రెడ్డిని ఇన్‌ఛార్జిగా నియమించడంతో సత్తిబాబు అసంతృప్తితో ఉన్నారని సమాచారం. గతంలో విజయసాయిరెడ్డి వల్లనే పార్టీకి ఇక్కడ డ్యామేజీ జరిగిందని, మళ్లీ జగన్ అదే తప్పు చేశారని బొత్స సత్యనారాయణ భావిస్తున్నారు. తనకు సంప్రదించుకుండానే ఉత్తరాంధ్రకు ఇన్‌ఛార్జిని నియమించడం, అదీ విజయసాయిరెడ్డిన నియమించడంతోనే జగన్ విజయనగరం జిల్లా పర్యటనకు దూరంగా ఉన్నారని కొందరు నేరుగా చర్చించుకుంటున్నారు. విజయసాయిరెడ్డి నియామకం నచ్చని బొత్స తన అసంతృప్తిని ఈ విధంగా తెలియజేశారంటున్నారు. జిల్లాలోనే క్లీన్ స్వీప్ చేసి... మొన్నటి ఎన్నికలలో బొత్స సత్యనారాయణతో పాటు జిల్లాలో అన్ని నియోజకవర్గ స్థానాల్లో కూటమి పార్టీలు క్లీన్ స్వీప్ చేశాయి. తొమ్మిదింటికి తొమ్మిదిస్థానాలు గెలుచుకున్నాయి. వైసీపీకి జీరో సీట్లు వచ్చాయి. జగన్ ఏకపక్ష నిర్ణయాల కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని బొత్స సత్యనారాయణ భావిస్తున్నట్లు తెలిసింది. తనకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని కూడా ఆయన బాధపడుతున్నారని తెలిసింది. ఇప్పటికిప్పుడు ఆయన పార్టీ మారే ఆలోచన చేయకపోయినా తన అసంతృప్తిని మాత్రం అధినేత ఎదుట ఈ విధంగా వెళ్లగక్కారంటున్నారు. మరొకరు తాను వ్యక్తిగత కారణాల వల్ల హాజరు కాలేకపోతున్నానని ముందుగానే పార్టీ హైకమాండ్ కు సమాచారం ఇచ్చారన్న వాదన కూడా వినిపిస్తుంది. మొత్తం మీద జగన్ టూర్ లో సత్తి బాబు లేకపోవడం హాట్ టాపిక్ గా మారింది.

## మహిళపై పిచ్చికుక్క దాడి
## తీవ్ర గాయలతో ఆసుపత్రికి తరలింపు



**పెన్ పవర్:**మేడ్చల్ మేడ్చల్ జిల్లా చర్లపల్లి డి విజన్ పరిధి ఇసి నగర్ కాలనీ లోని మహిళ పై పిచ్చికుక్క దాడి చేసి గాయపర్చడం స్థానికులను భయందోళనకు గురించేసింది. తీవ్ర గాయాలు కావడం తో మహిళ ను ఆసుపత్రికి తరలించారు. ఆరుబయట మొక్కలకు నీరుపోస్తున్న సమయంలో పిచ్చికుక్క దాడిచేసి 16చోట్ల కరవడంతో పరిస్థితి విషమంగా మారింది. . బయటికి వెళ్లాలన్నా జనాలు బయపడుతున్నారు. సంఘటనలు జరిగిన తరువాత కానీ జి హెచ్ ఎమ్ సి అధికారులు స్పందిస్తున్నారని ముందు జాగ్రత్త చర్యలు లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయి. పిచ్చికుక్కల బారినుండి జనాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

# ఘోరంగా ఓడిన టీమిండియా... చరిత్ర సృష్టించిన కివీస్ జట్టు

## రెండో టెస్టులోనూ న్యూజిలాండ్ దే విజయం

## 2-0తో సిరీస్ నెగ్గిన కివీస్

## 359 పరుగుల ఛేదనలో 245 పరుగులకే టీమిండియా ఆలౌట్

## 2012 తర్వాత సొంతగడ్డపై టెస్టు సిరీస్ ఓడిన టీమిండియా



**హైదరాబాద్ పెన్ పవర్:** సొంతగడ్డపై పులి అని పేరు తెచ్చుకున్న టీమిండియాకు దారుణ భంగపాటు ఎదురైంది. న్యూజిలాండ్ తో రెండో టెస్టులోనూ రోహిత్ సేనకు ఘోర పరాజయం తప్పలేదు. పుణేలో మూడ్రోజుల్లోనే ముగిసిన ఈ టెస్టు మ్యాచ్ లో కివీస్ 113 పరుగుల భారీ తేడాతో నెగ్గి... మూడు టెస్టుల సిరీస్ ను 2-0తో చేజిక్కించుకుంది. తద్వారా భారత గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్ విజయాన్ని అందుకుని చరిత్ర సృష్టించింది.

ఇక, భారత్ తన సొంతగడ్డపై ఓ టెస్టు సిరీస్ ను కోల్పోవడం 12 ఏళ్ల తర్వాత ఇదే ప్రథమం. 2012-13 సీజన్ లో భారత్ లో పర్యటించిన ఇంగ్లండ్ జట్టు 4 టెస్టుల సిరీస్ ను 2-1తో నెగ్గింది. ఆ తర్వాత ఇన్నాళ్లకు టీమిండియా మళ్లీ ఓడింది. ఇటీవల శ్రీలంకతో టెస్టు సిరీస్ లో 2-0తో చిత్తుగా ఓడిన న్యూజిలాండ్ ఈస్థాయిలో ఆడుతుందని ఎవరూ అనుకోలేదు. శ్రీలంక పర్యటనలో కివీస్ కు కెప్టెన్ గా వ్యవహరించిన టిమ్ సౌథీ పదవి నుంచి తప్పుకోగా... భారత్ లో పర్యటనకు టామ్ లాథమ్ కెప్టెన్ అయ్యాడు. లాథమ్ నాయకత్వంలోని న్యూజిలాండర్లు అన్ని రంగాల్లోనూ భారత్ ను గట్టి దెబ్బకొట్టి సిరీస్ కైవసం చేసుకోవడం విశేషం.

తొలి టెస్టు బెంగళూరులో జరగ్గా... న్యూజిలాండ్ పేస్ కు టీమిండియా బ్యాటింగ్ లైనప్ దాసోహం అంది. రెండో టెస్టులో స్పిన్ పిచ్ ఉంటుందని ముందే అంచనా వేయగా... ఇది టీమిండియాకు కలిసొచ్చే అంశమని అందరూ అనుకున్నారు. కానీ, కివీస్ పుణేలో స్పిన్ అస్త్రంతోనే టీమిండియాను కుప్పకూల్చడం గమనార్హం.

ఈ మ్యాచ్ లో మొదటి ఇన్నింగ్స్ లో కివీస్ 259 పరుగులు చేయగా... భారత్ 156 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ లో న్యూజిలాండ్ టీమ్ 255 పరుగులు చేసి, టీమిండియా ముందు 359 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే, టీమిండియా రెండో ఇన్నింగ్స్ లో 245 వద్ద తన పోరాటాన్ని ముగించింది. తొలి ఇన్నింగ్స్ లో 7 వికెట్లతో సత్తా చాటిన కివీస్ స్పిన్నర్ మిచెల్ శాంట్నర్... రెండో ఇన్నింగ్స్ లోనూ 6 వికెట్లతో టీమిండియా వెన్నువిరిచాడు. మరో స్పిన్నర్ అజాజ్ పటేల్ కు 2, పార్ట్ టైమ్ స్పిన్నర్ గ్లెన్ ఫిలిప్స్ కు 1 వికెట్ దక్కాయి. ఇక, ఇరు జట్ల మధ్య మూడో టెస్టు నవంబరు 1 నుంచి ముంబయిలో జరగనుంది. సిరీస్ ఫలితం తేలిన నేపథ్యంలో, చివరిదైన ఈ మూడో టెస్టు నామమాత్రంగా మారిపోయింది.

# ఎలైట్ లిస్టులో జైస్వాల్.. మూడో భారత క్రికెటర్

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ అరంగ్రేటం చేసిన ఏడాదిలోనే అరుదైన ఘనత సాధించాడు. ఒక క్యాలెండర్ ఇయర్‌లో టెస్టుల్లో1000కి పైగా పరుగులు చేసిన మూడో భారతీయుడిగా.. ప్రపంచంలో ఏడవ ఆటగాడిగా నిలిచాడు. జూలై 2023లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్ ద్వారా అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ఈ ఓపెనర్.. పూణే టెస్టులో ఈ ఘనత సాధించాడు. తద్వారా లెజెండరీ క్రికెటర్ గుండప్ప విశ్వనాథ్, సునీల్ గవాస్కర్ సరసన చేరాడు.స్వదేశంలో ఆడిన టెస్టుల్లో క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక పరుగులు చేసిన రికార్డు ఆసీస్ మాజీ కెప్టెన్ మైకేల్ క్లార్క్ పేరిట ఉంది. అతను 2012లో 1407 పరుగులు చేశాడు. అతని తర్వాత పాకిస్థాన్ ఆటగాడు మహ్మద్ యూసుఫ్ (2006లో 1126 పరుగులు) చేశాడు.

**ఒక క్యాలెండర్ ఇయర్‌లో హోమ్ టెస్టుల్లో 1000ం పరుగులు**

1407 పరుగులు: మైకేల్ క్లార్క్ (ఆస్ట్రేలియా, 2012)
1126 పరుగులు: మహ్మద్ యూసుఫ్ (పాకిస్థాన్, 2006)
1058 పరుగులు: గ్రహం గూచ్ ( ఇంగ్లండ్, 1990)
1047 పరుగులు: గుండప్ప విశ్వనాథ్ (భారత్, 1979)
1025లి పరుగులు: యశస్వి జైస్వాల్ (భారత్, 2024)
1013 పరుగులు: సునీల్ గవాస్కర్ ((భారత్, 1979)
1012 పరుగులు: జస్టిన్ లాంగర్ (ఆస్ట్రేలియా, 2004)





# రసవత్తరంగా రెండో టెస్టు.. 255 పరుగులకే కివీస్ ఆలౌట్.. భారత్ టార్గెట్ 359 రన్స్!




- పూణే వేదికగా భారత్, న్యూజిలాండ్ మధ్య రెండో టెస్టు
- రెండో ఇన్నింగ్స్‌లో కివీస్ 255 పరుగులకే ఆలౌట్
- మొదటి ఇన్నింగ్స్‌లో 103 పరుగుల ఆధిక్యం
- తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకొని భారత్ ముందు 359 పరుగుల లక్ష్యం

**హైదరాబాద్ పెన్ పవర్:** పూణేలోని ఎంసీఏ స్టేడియం వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో భారత్‌కు న్యూజిలాండ్ 359 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించింది. న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 69.4 ఓవర్లలో 255 పరుగులకే ఆలౌట్ అయింది. రెండో రోజు ఆటముగిసే సమయానికి 301 పరుగుల ఆధిక్యంలో ఉన్న న్యూజిలాండ్.. మూడో రోజు మరో 57 పరుగులు జోడించి ఆలౌటైంది. రెండు రోజులుగా ఎలాంటి వికెట్లు తీయని రవీంద్ర జడేజా ఇవాళ మూడు వికెట్లు తీశాడు. దాంతో కివీస్ ఇన్నింగ్స్ త్వరగా ముగిసింది. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ 4, రవీంద్ర జడేజా 3 వికెట్లు తీయగా.. అశ్విన్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఇక కివీస్ బ్యాటర్లలో కెప్టెన్ టామ్ లాథమ్ 86 పరుగులు చేస్తే, గ్లెన్ ఫిలిప్స్ 48 (నాటౌట్) రన్స్‌తో రాణించాడు. ఇక భారత్ తన తొలి ఇన్నింగ్స్ లో 156 పరుగులకే కుప్పకూలిన విషయం తెలిసిందే. 359 పరుగుల లక్ష్యఛేదనతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా ధాటిగా ఆడుతోంది. భోజన విరామానికి వికెట్ నష్టానికి 81 పరుగులు చేసింది. క్రీజులో యశస్వి జైస్వాల్ (46), శుభమన్ గిల్ (22) ఉన్నారు. భారత్ గెలవాలంటే ఇంకా 278 రన్స్ చేయాలి. కెప్టెన్ రోహిత్ శర్మ మరోసారి నిరాశపరిచాడు. 8 పరుగులు చేసి ఔటయ్యాడు.

# రెడ్ బికినీలో తేజస్వి.. సెగలు పుట్టిస్తున్న స్టిల్స్




దిశా పటానీ యొక్క ఫ్యాషన్ గేమ్ ఎల్లప్పుడూ వక్రరేఖ కంటే ముందు ఉంటుంది

**హైదరాబాద్ పెన్ పవర్:** టాలీవుడ్‌లో తనదైన స్టైల్‌తో ఓ ప్రత్యేకమైన క్రేజ్‌ను సంపాదించుకున్న తేజస్వి మదివాడ.. సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు హాట్ టాపిక్ అవుతూనే ఉంది. ఇన్ స్టాల్ గ్రామ్ లో ఆమె సొగసులు.. ఫ్యాషన్ స్టేట్‌మెంట్స్ ఫ్యాన్స్‌ను మరింత దగ్గర చేసాయి. ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఫోటోలు నెట్టింట సెన్సేషన్ అవుతున్నాయి.తాజాగా తేజస్వి రెడ్ కలర్ బికినీలో దిగిన ఫోటోలను షేర్ చేసింది. '%ూూా ×ు ×ూ%!' అంటూ క్యాప్షన్ పెట్టిన ఆ ఫోటోలు నెటిజన్లను ఆకర్షిస్తున్నాయి. ఆ డీప్ రెడ్ టోన్ లుక్‌తో తేజస్వి స్టన్నింగ్‌గా కనిపిస్తోంది. కూల్ సన్‌గ్లాసెస్, క్లీన్ అండ్ క్లాసీ లుక్‌తో స్మార్ట్‌గా పోజులిస్తూ అందరినీ అట్రాక్ట్ చేసింది. ఈ ఫోటోల్లోని గ్లామర్ దెబ్బకు ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. ప్రైవేట్ పూల్ సైడ్‌లో ఈ ఫోటో షూట్ చేసినట్టుగా కనిపిస్తోంది.అంతకు ముందు కూడా తన ఫిట్‌నెస్, స్టైలిష్ డ్రెస్సింగ్ సెన్స్‌తో తేజస్వి తరచూ సోషల్ మీడియా ఫాలోవర్లను అలరిస్తుంది. గ్లామర్ ఫోటో షూట్స్ తో తన అందాన్ని హైలైట్ చేస్తూ ఉండటం ఆమెకి కొత్తేమి కాదు. ఈసారి తేజస్వి చేసిన ఫోటో షూట్ గతంలో ఎన్నడూ లేనంత హాట్ టాపిక్ అయింది. ఫ్యాన్స్ కామెంట్స్ కూడా అదే రేంజ్ లో వచ్చాయి.కెరీర్‌లో సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న తేజస్వి.. ఇదే విధంగా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదిస్తోంది. ప్రస్తుతం తేజస్వి కొన్ని చిన్న సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, ఆమె లుక్స్ మాత్రం పెద్ద హీరోయిన్స్‌కు ఏ మాత్రం తీసిపోవడం లేదు. ఇక అమ్మడు త్వరలోనే మంచి బ్రేక్ అందుకుంటుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఈ ఫోటోలు చూస్తుంటే, ఆమె గ్లామర్ రేంజ్ ఏ స్థాయిలో ఉందో చెప్పక్కర్లేదు. మరి ఈ గ్లామర్ లుక్స్ ద్వారా అమ్మడికి ఇంకా ఏమైనా అవకాశాలు పెరుగుతాయా లేదో చూడాలి.





ఈ ఫోటోలలో నిధి అగర్వాల్ చక్కదనం యొక్క ప్రతిరూపం

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com